క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు వేరువేరుగా ఆదివారం రూ.2,00,116 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా పీవీఎస్ కిరణ్ రూ.1,00,000, ఎం.రమాదేవి రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్‌లు దుర్గాప్రసాద్, హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అలాగే స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు



పోలసానిపల్లిలో దుకాణదారులకు సూచనలందిస్తున్న గ్రామ కార్యదర్శి

భీమడోలు: ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఆదివారం గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పోలసానిపల్లిలో గ్రామ కార్యదర్శి షేక్ రహీమాబేగం సూచనల మేరకు ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసుల వాడకాన్ని నిషేధించాలని కోరుతూ గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, సిబ్బంది భీమడోలు జంక్షన్, పోలసానిపల్లి ఏరియాల్లోని కూరగాయల దుకాణాలు, చికెన్, మటన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగాన్ని నివారించాలని, జూట్, గుడ్డ సంచులు వినియోగించాలని దుకాణదారులకు తెలియజేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీగా జరిమానాలు విధిస్తామని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గోవింద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రామకోటి ఉత్సవాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో గత నెల 8వ తేదీ నుంచి జరుగుతున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు ఆదివారం నాటితో ముగిశాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రామనామ పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు 2 వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం 6.30 గంటలకు నగరానికి చెందిన ది వెంకట్రాయ నాట్య శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచారిణి నీలి శర్వాణి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్చక స్వాములు దివాకరుని శ్రీ వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఆరోగ్య సర్వేకు ప్రజలు సహకరించాలి



ఇంటింటా సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: గ్రామాల్లో ఇంటింటా ఆరోగ్య సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్టు పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలు సేకరిస్తున్నారు. నివేదికను వైద్య అధికారికి అందజేస్తామని వారన్నారు. సర్వే చేసిన ఇంటి గుమ్మం వద్ద క్రమ సంఖ్య నమోదు చేస్తున్నట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బందికి, గృహాల్లో వ్యక్తులు పూర్తిగా సహకరించి అనారోగ్య సమాచారాన్ని తెలియజేయాలన్నారు. అప్పుడే వ్యాధి నిర్ధారణ, నిర్మూలనకు తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన వెంట ఎంపీహెచ్‌ఓ హరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

వెదురు.. గిరిపుత్రుల ఆదాయ వనరు

- పశ్చిమ మన్యంలో 5.381 ఎకరాల్లో వెదురు వనాలు
- ఒకసారి నరికితే మూడేళ్లలో మళ్లీ పెరుగుదల
- వెదురు వనరులతో కొండరెడ్డి కుటుంబాల జీవనోపాధి



అడవిలో వెదురు కలపను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు



అడవిలో గిరిజనులు నరికిన వెదురు కర్రలు

బుట్టాయగూడెం: దటమైన అడవుల్లో పెరిగే వెదురును పచ్చ బంగారంగా పిలుస్తుంటారు. వెదురుతో అనేక ఉపయోగాలు ఉన్నాయి. వెదురు కర్రలను పందిళ్లు, ఇంటిపై కప్పులకు, నిచ్చెనలకు ఉపయోగిస్తారు. అలాగే వెదురుతో వివిధ రకాల కళాకృతుల తయారీకి వినియోగిస్తున్నారు. వెదురును బద్దలుగా చీల్చి చేటలు, బుట్టలు గంపలు, తట్టలు తదితర వస్తువులను చేస్తారు. అటువంటి వెదురు సాగును విస్తరింపజేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. జాతీయ మిషన్‌కు అనుసంధానంగా రాష్ట్రంలో వెదురు సాగును ప్రోత్సహిస్తుంది. వెదురులో రకాలు, సాగు పరిస్థితి, రైతులకు ఆదాయ వనరులు వంటి విషయాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. వెదురుతో ఉత్పత్తుల తయారీ, వాటి మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టి వెదురు సాగు విస్తరణే లక్ష్యంగా ముందుకు సాగుతుంది.

పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో 5.381 ఎకరాల్లో వెదురు వనాలు

జిల్లాలో 1,35,800 హెక్టార్లలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. వీటిలో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల పరిధిలో 1,12,445 హెక్టార్లలో విస్తరణంలో ఆవరించి ఉంది. వాటిలో సుమారు 5,381 ఎకరాల్లో వెదురు వనాలు ఉన్నాయి. బుట్టాయగూడెం మండలంలోని ముంజులూరు, ఒర్రింక, మోతుగూడెం, రేగులపాడు, రేపల్లే, మోతుగూడెం, పోలవరం మండలంలోని గుమ్ములూరు, కొల్లుమామిడి -1, 2, తదితర ప్రాంతంలో అటవీశాఖ అధికారులు వెదురు కూపులను పెంచుతున్నారు. ఒక్కొక్క కూపును 6 కూపులు విభజించి పెంచుతున్నారు. వెదురు బాగా పెరిగి కర్ర తయారైన తర్వాత ఫారెస్టు అధికారులు వెదురు నరికిస్తారు. ఈ ప్రాంతంలో వన సంరక్షణ సమితీ (వీఎస్‌ఎస్) ఏర్పాటు చేసిన కూపులు ఉన్నాయి. బుట్టాయగూడెం మండలంలోని రేపల్లి, రేగులపాడు, ముంజులూరు, చింతపల్లి, అటవీప్రాంతంలో వెదురు వనాలు విరివిగా ఉన్నాయి. ఒకసారి వెదురు నరికిన ప్రదేశంలో మూడేళ్లలో మళ్లీ అక్కడే మొలకెత్తుతుంది. వెదురు నరికే కార్యక్రమాన్ని అటవీశాఖ అధికారులు చేపడతారు. అటవీ పరిసర ప్రాంతంలోని కొండరెడ్డి గిరిజన కూలీలతో వెదురు నరికిస్తారు. అక్టోబర్ నెలలో వెదురు నరికే పనులు చేపట్టి మార్చి వరకూ నరికే పనులు చేస్తారు. గిరిజన అటవీ ప్రాంతంలో నరికిన వెదురును జంగారెడ్డిగూడెం అటవీశాఖ డిపోకు తరలిస్తారు.

250 కొండరెడ్డి కుటుంబాలకు ఉపాధి

పశ్చిమ మన్యంలో మారుమూల గ్రామాల్లో నివసిస్తున్న కొండరెడ్డి గిరిజనులకు అంతగా ఉపాధి అవకాశాలు ఉండవు. పోడు వ్యవసాయమే వీరి ప్రధాన జీవన వనరు. అయితే బుట్టాయగూడెం, పోలవరం మండలాల పరిధిలో ఎక్కువగా ఉన్న వెదురు నరికే పనులు సుమారు 250 కొండరెడ్డి గిరిజన కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. అక్టోబర్‌లో పనులు ప్రారంభమై ఆరు నెలల పాటు గిరిజనులకు ఆదాయన్ని తెచ్చి పెడుతుంది.

ముమ్మరంగా వెదురు నరుకు పనులు

ప్రస్తుతం అటవీ ప్రాంతంలో వెదురు నరుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్న బెంబో కూపు-1 పరిధిలో గల ముంజులూరు, కల్లుమామిడి, తదితర గ్రామాల పరిధిలో వెదురు నరుకు పనులు జరుగుతున్నాయి. అక్టోబర్ నుంచి ప్రారంభమైన ఈ పనులు మార్చి నెలాఖరు వరకు జరుతాయని ఫారెస్టు అధికారులు తెలిపారు. కాగా ఇక్కడ నరికిన వెదురు కలపను జంగారెడ్డిగూడెం వెదురు బేంబో డిపోకు తరలిస్తున్నారు.

వెదురుతో ఉపాధి



అటవీ ప్రాంతంలో ఉన్న వెదురు నరికే పనులతో ఉపాధి పొందుతున్నాం. 6 నెలలపాటు మాకు చేతి నిండా పనులు ఉంటాయి. ముజులూరు, కల్లుమామిడి గ్రామాల పరిధిలో ఉన్న వెదురు కూపుల్లో పనులు జరుగుతున్నాయి.

– నడపల ముక్కారెడ్డి, గిరిజనుడు, చింతపల్లి, పోలవరం మండలం

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం



కొయ్యలగూడెం జామియా మసీదులో రంజాన్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కొయ్యలగూడెం: ముస్లింలకు అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. కొయ్యలగూడెం జామియా మస్జిద్‌లో ఐదు పూటలా నమాజు ఆచరించి ముస్లింలు దానధర్మాల కార్యక్రమాలు చేపట్టారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, వేదాంతపురం, యర్రంపేట, బయ్యనగూడెం తదితర గ్రామాల్లో ఉన్న మసీదుల వద్ద రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు.

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

ఏలూరు (టూటౌన్): సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి జిల్లా సమావేశం పిలుపునిచ్చింది. ఏలూరు అన్నే భవనంలో ఆదివారం నిర్వహించిన సమితి సమావేశానికి ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘ నేతలు మాట్లాడుతూ ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను మోసగించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి రద్దు చేసిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు బదులు మరింత ప్రమాదకర కొత్త చట్టాలు తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల కోరుతున్న చట్టాలు కాకుండా కార్పొరేట్ కంపెనీలు కోరుతున్న చట్టాలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక లేబరు కోడ్‌లను రద్దు చేయాలని, రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు విడనాడాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 5వ తేదీన జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో తాగునీటి బోరు ప్రారంభం



జగనన్న కాలనీలో నూతనంగా ప్రారంభించిన తాగునీటి బోరు

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో తాగునీటి బోరు ప్రారంభించారు. కాలనీలో నిర్మించిన గృహాలకు తాగునీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా చాలామంది ఇంటి నిర్మాణాలు మధ్యలో నిలిపివేశారు. దీంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ ముప్పిడి విజయకుమారి ఆర్‌డబ్ల్యూఎస్ సహకారంతో తాగునీరు బోరు ఏర్పాటు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే జగనన్న కాలనీ నుంచి అశోక్‌నగర్ మీదుగా కొయ్యలగూడెంకు, అదేవిధంగా కాలనీ నుంచి జాతీయ ప్రధాన రహదారి చేరుకోవడానికి రహదారులు అభివృద్ధి చేయాల్సిందిగా ప్రజలు కోరారు. దీనిపై సర్పంచ్ మాట్లాడుతూ పక్కా రహదారుల నిర్మాణానికి కృషి హామీ ఇచ్చారు.

మెట్టలో అంతరిస్తున్న జీడి తోటలు





మెట్ల ప్రాంతంలో విస్తరించి ఉన్న జీడి తోట
మంచు కారణంగా జీడి పూత మాడిపోతున్న దృశ్యం →

చింతలపూడి: ఒకప్పుడు ఏటా మెట్ట రైతులకు కోట్లాది రూపాయల రాబడిని ఆర్జించి పెట్టిన జీడి మామిడి తోటలు ప్రస్తుతం అంతరించి పోతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా ఒక ఏడాది లాభాలు వస్తే రెండేళ్లు నష్టాలను చవిచూస్తున్నారు మెట్ట రైతులు. దీంతో గత పదేళ్లుగా జీడి తోటలను తొలగించి ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించారు. ముఖ్యంగా పామాయిల్, మొక్కజొన్న, వేరుశనగ, అరటి పంటలను ఎక్కువగా పండిస్తున్నారు. అదీకాక మెట్ట ప్రాంతంలో భూగర్భ జలాల వినియోగం పెరిగాక వాణిజ్య పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. చింతలపూడి సబ్ డివిజన్‌లో ఒకప్పుడు వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్న జీడి తోటలు ప్రస్తుతం 2 వేల హెక్టార్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం జీడి పిక్కల బస్తా(100 కేజీలు) రూ.15 వేల వరకు పలుకుతోంది. జీడి తోటల పెంపకం వల్ల రైతులకు రకరకాలుగా ఆదాయం లభిస్తుంది. మన ప్రాంతంలో రైతులు జీడి పిక్కలను మాత్రమే సేకరిస్తారు. జీడి పండ్లను చెట్ల కిందే వదిలేస్తారు. అదే ఇతర రాష్ట్రాల్లో అయితే అక్కడి రైతులు పండ్లను కూడా సేకరించి ఆదాయం పొందుతున్నారు. వీటితో జామ్, పండ్ల రసాలు, తయారు చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. విదేశీ ఎగుమతులపై ఇక్కడి రైతులకు దృష్టి లేదు. ఏటా ఇక్కడి నుంచి కమీషన్ దారులు లారీల్లో జీడి పిక్కలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఉన్న తోటలను కాపాడుకోవడంతో పాటు కొత్తగా తోటలు వేసుకునే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది



ఈ ఏడాది మార్కెట్లో జీడి పిక్కల ధర ఆశాజనకంగానే ఉంది. అయితే గత రెండు నెలలుగా కురిసిన మంచు కారణంగా పూత మాడిపోయింది. దిగుబడి కూడా భారీగా తగ్గిపోయింది. దీంతో నష్టాలు తప్పేలా లేవు.

– ఎస్‌కే అహ్మద్, కమలాపురం

పశువులకు గాలికుంటు వ్యాధి నిర్మూలన టీకాలు

దెందులూరు: గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామని పోతునూరు పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు అన్నారు. ఆదివారం పోతునూరు పశు వైద్యశాలలో ఆయన సిబ్బందితో కలిసి ఇంటింటా పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజులపాటు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పోతునూరులో 2,200 ఆవులు, గేదెలు ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మహిళల రక్షణకు ప్రాధాన్యత



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులతో ఏఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ప్రత్యేక శ్రద్ధతో జిల్లాలో మహిళల రక్షణ, భద్రతకు పెద్దపీట వేసినట్లు ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏలూరు అమీనాపేటలోని పోలీస్ కళ్యాణ మండపంలో విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ మహిళా సాధికారిత, లైంగిక సమానత్వం, మహిళా భద్రత తదితర అంశాలపై సాంస్కృతి, నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు మాట్లాడుతూ మహిళలపై నేరాలను అదుపు చేసేందుకు సత్వర న్యాయం చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

వీడని బర్డ్‌ఫ్లూ భయం... పెరగని చికెన్ అమ్మకం



గణపవరం: బర్డ్‌ఫ్లూ భయం ఇంకా ప్రజల మది నుంచి పూర్తిగా తొలగిపోలేదు. ఇంకా చికెన్ అమ్మకాలు నామమాత్రంగానే సాగుతున్నాయి. రెండు వారాలుగా మూత పడిన చికెన్ వ్యాపారం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అయితే ఇంకా పూర్తిగా గాడిన పడటానికి మరో రెండు వారాలు పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. చికెన్, కోడిగుడ్లు నిర్భయంగా తినవచ్చునని అధికార యంత్రాంగం ప్రకటిస్తున్నా ప్రజలు మరి కొంత కాలం చికెన్‌కు దూరంగా ఉంటేనే మంచిదని భావిస్తున్నారు. దీనితో చికెన్ వ్యాపారం ఇంకా కోలుకోలేదు. ఈ రెండు వారాల్లో చికెన్ అమ్మకాలు కేవలం 20 శాతం మాత్రమే పెరిగాయి.

సారా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే చర్యలు



జంగారెడ్డిగూడెం: ఎక్సైజ్ స్టేషన్‌లో బెల్లం వ్యాపారులతో సమావేశం



చింతలపూడి: గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: నాటుసారా తయారీదారులకు బెల్లాన్ని విక్రయించవద్దని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.పాండురంగారావు బెల్లం వ్యాపారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. వ్యాపారులు నాటు సారా తయారీదారులకు బెల్లం సరఫరా చేయకూడదని, అలా సరఫరా చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు, ఎస్సైలు ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా తయారీ నేరం

చింతలపూడి: నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమని ఎక్సైజ్ సీఐ పి అశోక్ హెచ్చరించారు. నాటు సారా వల్ల జరిగే అనర్థాలపై ఆదివారం పంతంగలగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా చింతలపూడి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సారా తయారీ, విక్రయం, రవాణా చేసే వారి సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 14405కు గాని ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి సెల్ నెంబర్ 94409 02428లకు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి కలుగుతుందని యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ కార్యదర్శి తోట ఎడ్వర్డ్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ అంతోని హైస్కూల్ ప్రాంగణంలో యాంటినోరీ సోషల్ సర్వీస్ సొసైటీ తరుపున 100 మంది కాలేజీ విద్యార్థులకు కాలేజీ బ్యాగ్‌లు, హాట్ క్యారేజీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడ్వర్డ్ మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా గత 20 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామన్నారు.

మెట్టలో పెరుగుతున్న ఎండలు



ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా ఫైర్ స్టేషన్ సెంటర్



మెయిన్ రోడ్డు పక్కన లస్సీ తాగుతూ సేద తీరుతున్న ప్రజలు

- మార్చి ప్రారంభంలోనే మొదలైన గ్రీష్మ తాపం
- బెంబేలెత్తిపోతున్న ప్రజలు

చింతలపూడి: రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మెట్ట ప్రాంతంలో ఒక్కసారిగా పెరిగిన ఎండలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రజలు సూర్య తాపాన్ని తట్టుకోలేకపోతున్నారు. 34 నుంచి 36 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటంతో ఎండల నుంచి రక్షణ పొందేందుకు నానా తంటాలు పడుతున్నారు. కొందరైతే ఎండలకు భయపడి ఇళ్ల వద్దనే కాలాన్ని వెళ్లదీస్తున్నారు. ఎండలకు మధ్యాహ్నం వేళల్లో రోడ్లపై జన సంచారం అంతగా కనిపించడం లేదు. ఒక వేళ బయటకు వస్తే పళ్ల రసాలు, కొబ్బరి బొండాలు, చెరుకు రసం, చల్లని శీతల పానీయాల వైపు పరుగులు పెడుతున్నారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ముదురుతున్న ఎండలతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. పరీక్షలు రాసిన తరువాత ఆ సమయంలో ఎండలో ఇళ్లకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడే సూచనలు కనిపిస్తున్నాయి. రోడ్లు మండుతున్న కొలిమిలా మారడంతో వాహనదారులైతే పగటి పూట చుక్కలు చూస్తున్నారు. వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రత ఇలా ఉంటే మే నెల రోహిణీ కార్తెలో ఎండలు ఇంకెంత దారుణంగా ఉంటాయోనని ప్రజలు హడలిపోతున్నారు. కాగా వేసవి ప్రారంభం అయినా మండలంలో ఎక్కడా చలి వేంద్రాల జాడ కానరావడం లేదు.

మునుపెన్నడూ చూడలేదు



మార్చి మొదట్లోనే ఎక్కువ ఎండలు కాయడం మునుపెన్నడూ చూడలేదు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. బహుశా అడవులు అంతరించుకుపోవడం, చెరువుల్లో నీరు లేకపోవడం కారణంగానే ఈ దుస్థితి ఏర్పడింది. అడవులను పునరుద్ధరించడం, ఉద్యమంలా మొక్కలు నాటడంపై ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలి.

ఎండీ సాదిఖ్, సీనియర్ సిటిజన్, చింతలపూడి